క్లుప్తంగా

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థి సత్తా..



గంగరాజును అభినందిస్తున్న డీఈఓ మాణిక్యంనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి నక్కెళ్ల గంగరాజు జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటాడు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన పోటీల్లో ఆంధ్ర తరఫున పాల్గొని తన ప్రతిభను కనబరిచాడు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి యు. మాణిక్యం నాయుడు తన కార్యాలయంలో విద్యార్థి గంగరాజును శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

- టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారు పాప



మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారు పాప

నెల్లిమర్ల రూరల్: మహిళల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారు పాప సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో మహిళ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వయంకృషితో కష్టపడితే ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు, వీసీ పీకే మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ: గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌బీఎల్ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని గోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌బీఎల్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రంథాలయం ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు బాలా అప్పలరాజు, విక్రం జగన్నాథం, హెచ్‌బీఎల్ ప్రతినిధులు రామకృష్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భాషోపాధ్యాయులకు నష్టం కలిగించొద్దు

- ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృతిక శుక్లకు సమితి ప్రతినిధుల వినతి

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి భాషోపాధ్యాయ పోస్టుల రద్దుకు అవకాశం లేకుండా నూతన విద్యావిధానం అమలు చేయాలని సంస్కృత ఉపన్యాసక పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి ప్రతినిధులు విజయవాడలోని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృతిక శుక్లను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు శంకరశర్మ, బోడిశెట్టి రామగోపాల్, ఎ.భాస్కరరావు, ఎం.శోభన్‌బాబు, ఎం.ఈశ్వరరావు, త్రినాథ్ పాల్గొన్నారు.

సర్వేలు వేగవంతం

విజయనగరం: పన్ను వసూళ్లతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను కూడా సకాలంలో పూర్తి చేసి నివేదికలు అందించాలని అడ్మిన్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024 - 25 ఆర్థిక సంవత్సరం ముగింపు దిశకు చేరుకోవడంతో పన్ను వసూళ్లకై శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రాణాలు కాపాడిన సంతృప్తి లభించింది..

2024 అక్టోబర్ 5 శనివారం ఉదయం 8.15 గంటలకు పలాస నుంచి విశాఖ వెళ్తున్న పాసింజర్ రైలు (08531) విజయనగరం జంక్షన్‌కు చేరుకుంది. వందలాది మంది ప్రయాణికులు రైలు ఎక్కుతూ, దిగుతూ బిజీగా ఉన్నారు. మరో రెండు నిమిషాల్లో రైలు బయలుదేరుతుందనగా... రోలింగ్ ఎగ్జామినర్‌గా విధి నిర్వహణలో ఉన్న నేను రైలు చివర రెండో బోగీ బ్రేక్ బీమ్‌హ్యాంగ్ అయిన విషయం గుర్తించాను. బోగీలు దాదాపు పడిపోయే స్థితికి చేరుకున్నాయి. వెంటనే గార్డుకు సమాచారం ఇచ్చి ట్రైన్‌ను నిలిపివేయించాను. అధికారులు, సిబ్బంది సుమారు గంటపాటు కష్టపడి రైలును సిద్ధం చేశారు. వందలాది మంది ప్రాణాలు కాపాడిన సంతృప్తి లభించింది. రైల్వే జీఎం ప్రశంసాపత్రం అందించడం మరువలేను. - చిక్కాల హరిత, రైల్వే సీఅండ్ డబ్ల్యూ డిపార్ట్‌మెంట్, విజయనగరం



స్వశక్తితోనే అభివృద్ధి సాధించాలి



మహిళలు విద్య, వైద్యారోగ్య, సామాజిక, రాజకీయ రంగాల్లో స్వశక్తితో అభివృద్ధి సాధించాలి. ప్రస్తుత సమాజంలో మహిళలు నింగి నుంచి నేల వరకూ ప్రతి రంగంలోనూ అభివృద్ధి చెందడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నాయకత్వ ప్రతిభను చూపిస్తూ వారి ప్రత్యేకతను చాటుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం మహిళల దినోత్సవం కేవలం మహిళను గౌరవించడమనే భావనతో మహిళా దినోత్సవం పెట్టేవారేమో కానీ ప్రస్తుత సమాజంలో మహిళా దినోత్సవం మహిళలు సాధించిన అభివృద్ధిని, మహిళలకు ఉన్న సత్తాను గుర్తించి వారికి కూడా సమానస్థాయిని ఇవ్వండని కోరుతూ నిర్వహించుకోవడం ఆనందదాయకం.
- లక్ష్మీనరేన్ బెల్లాన, ఫ్యామిలీ అండ్ ఉమెన్స్ స్పెషలిస్ట్, లయన్స్ ఇంటర్నేషనల్, విజయనగరం

నిర్లక్ష్యపు నీడ..

డివిజన్	వసతిగృహాలు	విద్యార్థుల సంఖ్య
విజయనగరం	22	1300
విజయనగరం రూరల్	16	1200
బొబ్బిలి	14	1022

- బీసీ సంక్షేమ వసతిగృహాలకు ఆరు నెలలుగా అందని డైట్ చార్జీలు
- అప్పులు చేసి నిర్వహణ
- ఆర్థిక సమస్యలతో సతమతం



పూసపాటిరేగ బీసీ సంక్షేమ వసతిగృహం



భోగాపురం బీసీ సంక్షేమ వసతిగృహం

పూసపాటిరేగ: సంక్షేమ వసతిగృహాల నిర్వహణపై సర్కారు చిన్నచూపు చూస్తోంది. వసతిగృహాలలో ఉంటూ చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మంజూరు చేయాల్సిన డైట్ చార్జీల మంజూరుపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత సెప్టెంబర్ నెల నుంచి ఆరు నెలలుగా బీసీ సంక్షేమ వసతిగృహాలకు మంజూరు చేయాల్సిన డైట్ చార్జీలు మంజూరు చేయకపోవడంతో సంబంధిత అధికారులు అప్పులు చేసి మరీ వసతిగృహాలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్థిక సమస్యలతో సతమతం కావడంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పక్కాగా అమలు చేయలేని దుస్థితి ఏర్పడింది. జిల్లాలో 52 బీసీ సంక్షేమ వసతిగృహాలుండగా వాటిలో సుమారు 3,522 మంది విద్యార్థులు చదువుతున్నారు. నిరుపేద విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాటలు వేసే వసతిగృహాల నిర్వహణపై సర్కారు నిర్లక్ష్యపు ధోరణి ప్రదర్శించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. గత ప్రభుత్వంలో డైట్ చార్జీలు ప్రతి రెండు నెలలకోసారి ఠంచన్‌గా మంజూరు చేసేవారు. ఐదేళ్లపాటు క్రమం తప్పకుండా డైట్ చార్జీలు మంజూరు చేశారు. నాడు - నేడు పనులలో భాగంగా వసతిగృహాలను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వం మారాక అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరగడం, చాలీచాలని డైట్ చార్జీలతో వసతిగృహాల నిర్వహణ అంతంతమాత్రంగా మారింది. ఇప్పటికైనా సంక్షేమ పథకాల ఊసెత్తని సర్కారు కనీసం వసతిగృహ విద్యార్థులకైనా న్యాయం జరిగేలా డైట్ చార్జీలు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం

డైట్ చార్జీలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి వసతిగృహం నిర్వహిస్తున్నాం. వసతిగృహం నిర్వహణకు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించకోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. డైట్ చార్జీలు చెల్లించి వసతిగృహాల నిర్వహణకు సహకరించాలి.
ఎ.కొండ, వసతిగృహ సంక్షేమాధికారి

● స్వర్ణ పుష్పాలంకరణ..



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణ పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.
- విజయనగరం టౌన్

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లి జాతర



విజయనగరం టౌన్ ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

విజయనగరం టౌన్: నగరంలోని మహరాజా సంగీత, ప్రభుత్వ నృత్య కళాశాల వద్దనున్న ఎల్లమ్మ తల్లి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. సిరుల మహోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బియ్యం, పెసలు, పప్పుదినుసులు, వేపాకులు, గుడ్లను సమర్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో సిరిమాను ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

పెదతాడివాడలో..



డెంకాడ: అగ్ని గుండం తొక్కుతున్న పూజారి ఎల్లయ్య

డెంకాడ: మండలంలోని పెదతాడివాడలో ఎల్లమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ప్రధానవీధిలో పూజారి చిట్టి ఎల్లయ్య పాల ధార తిరిగారు. అనంతరం భక్తజనం సమక్షంలో పూజారి ఎల్లయ్య అగ్నిగుండం తొక్కారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- ఎస్పీ వకుల్ జిందల్



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో శుక్రవారం స్థానిక డీపీఓ ప్రాంగణంలో మహిళా పోలీస్ కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఏఎస్పీ సౌమ్యలతతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబంలో అందరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. తిరుమల, మెడికవర్ ఆస్పత్రులకు చెందిన వైద్యులు యమున, జీవిత, తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారుపాప, విజయనగరం రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఎన్. గోపాలనాయుడు, ఆర్.రమేష్కుమార్, టి.శ్రీనివాసరావు, తిరుమల ఆస్పత్రి పీఆర్వోలు మురళి, సత్యనారాయణ, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని వైఎస్సార్ నగర్ శివారులో పేకాటాడుతున్న వారిని పోలీసులు డ్రోన్ సహాయంతో గురువారం రాత్రి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 6,570 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేకాట శిబిరాలను గుర్తించేందుకు డ్రోన్ల సహాయం తీసుకుంటున్నామని చెప్పారు.



చురుగ్గా పన్ను వసూలు ప్రక్రియ

విజయనగరం: పట్టణంలోని వివిధ ప్రాంతాలలో కార్పొరేషన్ సహాయ కమిషనర్ కె. అప్పలరాజు నేతృత్వంలో సిబ్బంది శుక్రవారం పన్ను వసూలు చేశారు. పన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా సహాయ కమిషనర్ కోరారు. పన్ను చెల్లించని ఎడల విద్యుత్, కుళాయి కనెక్షన్లు నిలిపివేస్తామన్నారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమం



సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ

విజయనగరం గంటస్తంభం: దేశంలో, రాష్ట్రంలో రోజు రోజుకూ మహిళలపై పెరుగుతున్న హత్యలు, అత్యాచారాల నిర్మూలనతో పాటు హక్కుల సాధనకు ఉద్యమం చేయక తప్పదని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎల్‌బీజీ నగర్‌లో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మహిళలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల హామీలు సైతం నెరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు జి.పుణ్యావతి, కుమారి, రమాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ముచ్చువాని చెరువు గట్టుపైన జరిగిన కార్యక్రమంలో నగర కార్యదర్శి సి.లక్ష్మి, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థికి డాక్టరేట్



సుమహాసన్‌కు డాక్టరేట్ పట్టా అందిస్తున్న యూనివర్సిటీ వీసీ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధన విద్యార్థి సింగుపురం సుమహాసన్‌కు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'క్లౌడ్ ఆధారిత ఐఓటీలో ఆరోగ్య సంరక్షణ సెన్సరీ డేటా భద్రత, సమర్థవంతమైన ప్రసారం: నోడ్-లెవల్ విధానం' అనే అంశంపై చేపట్టిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని ఈ సందర్భంగా సుమహాసన్ తెలిపారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల్లో భద్రత, డేటా ప్రసార సామర్థ్యాన్ని మెరుగుపరచడం.. రియల్ టైమ్ ప్రాసెసింగ్ సమస్యలను పరిష్కరించడానికి పరిశోధన దోహద పడుతుందన్నారు. ప్రస్తుతం ఆయన విశాఖలోని గాయత్రి విద్యాపరిషత్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ (అటానమస్) కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సుమహాసన్‌కు యూనివర్సిటీ అధికారులు, కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు, సహ పరిశోధన విద్యార్థులు అభినందనలు తెలిపారు.

జన ఔషధి ద్వారా నాణ్యమైన మందులు

- ఎంపీ అప్పలనాయుడు, కలెక్టర్ అంబేద్కర్



ఔషధాలను పరిశీలిస్తున్న ఎంపీ అప్పలనాయుడు, కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం ఫోర్ట్: జన ఔషధి ద్వారా కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ధరకే మందులు అందిస్తోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. పట్టణంలోని డీసీఎంఎస్‌లో జన ఔషధి దినోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతర మందుల షాపుల్లో ధరలతో పోలిస్తే జన ఔషధి షాపుల్లో దాదాపు మూడోవంతు ధరకే నాణ్యమైన మందులు లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా జనరిక్ మందులను సిఫార్సు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జీవనరాణి, ఔషధ నియంత్రణశాఖ ఎ.డి రజిత, డీసీఎంఎస్ మేనేజర్ సాయికుమార్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విజయనగరం అర్బన్: పట్టణంలోని వివిధ విద్యాసంస్థల్లో అంతార్జాతీయ మహిళా దినత్సోవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో ఇన్‌చార్జ్ వీసీ డి.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు విద్యావంతులైన మహిళలను ఘనంగా సత్కరించారు. యూనివర్సిటీ మహిళా సాధికారత, ఫిర్యాదుల విభాగం సమన్వయకర్త డాక్టర్ బి.నళిని పర్యవేక్షణలో 'వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు జిల్లా ఆడిట్ అధికారిణి బి.అరుణకుమారి, సైకాలజిస్ట్ రమ్య అగస్థి ముఖ్య వ్యక్తలుగా హాజరయ్యారు. అనంతరం ఇన్‌చార్జ్ వీసీ, ముఖ్య వ్యక్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, వివిధ విభాగాల మహిళా అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కార్పొరేషన్ కార్యాలయం, సీతం ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంఆర్ ఫార్మసీ కళాశాలల్లో వేడుకలు జరిగాయి.